నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 22 జూన్ 2024 | KARIMNAGAR

## యోగాతో ఆరోగ్యం

కరీంనగర్‌లో ప్రాణాయమం చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



నమస్తే నెట్‌వర్క్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వివిధ పాఠశాలల ప్రాంగణాలు, మైదానాల్లో యోగా శిబిరాలు నిర్వహించారు. యోగా గురువుల పర్యవేక్షణలో ప్రాణాయామంతో పాటు ఆసనాలు వేశారు. జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమా?

- ఖబడ్దార్ ఎన్‌డీఏ సర్కార్
- విద్యార్థి, యువజన సంఘాల హెచ్చరిక




కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ సమితి ప్రతినిధులు

కరీంనగర్ కలెక్టరేట్/తెలంగాణ చౌక్, జూన్ 21 : దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని సన్నాయి నొక్కులు నొక్కుతూ.. వారి భవిష్యత్తుతోనే కేంద్రం ప్రభుత్వం చెలగాట మాడుతున్నదని విద్యార్థి, యువజన సంఘాలు మండిపడ్డాయి. 'ఖబడ్దార్ ఎన్డీఏ సర్కార్' అంటూ హెచ్చరించాయి. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయని, నీట్‌ను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ధర్నా చేశారు. అంతకు ముందు తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ, జాతీయ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఘోరంగా వైఫల్యం చెందిందని, సత్వరమే ఎన్‌టీఏ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే నీట్ పేపర్ లీక్ కావడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు జరుగుతున్నా ఎన్‌డీఏ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడకపోతే కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓవైపు నీట్‌లో అవకతవకలు, మరోవైపు యూజీసీ నెట్ రద్దుతో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని మండిపడ్డారు. నీట్‌లో జరిగిన అక్రమాలు కప్పిపుచ్చేందుకే కేంద్రం యూజీసీ నెట్‌ను రద్దు చేసిందని ఆరోపించారు. పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకు అప్పగించాలని సూచించారు. నీట్‌పై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, లేనిపక్షంలో వారి ఇండ్లను ముట్టడించేందుకు కూడా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ మాట్లాడగా, విద్యార్థి సంఘాల నాయకులు రామారపు వెంకటేశ్, అరవింద్, నీరటి రాంప్రసాద్, నరేశ్, మామిడిపల్లి హేమంత్, రోహిత్, కనకం సాగర్, రామ్‌యాదవ్, ఇషాక్, వినయ్, 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల అర్బన్ బ్యాంకును అగ్రగామిగా నిలుపాలి

- రాజకీయాలకతీతంగా కృషి చేయాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ముందుకు సాగాలి
- పాలకవర్గానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సూచన



అర్బన్ బ్యాంకు చైర్మన్ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల రూరల్/ సిరిసిల్ల టౌన్/ ఎల్లారెడ్డిపేట, జూన్ 21: సిరిసిల్ల అర్బన్ బ్యాంకు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 47సహకార బ్యాంకుల్లో సిరిసిల్ల అర్బన్ బ్యాంకును అగ్రగామిగా నిలుపాలని, అందుకు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని పాలకవర్గానికి సూచించారు. శుక్రవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో అంబేద్కర్ విగ్రహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ఆవిష్కరించారు. తర్వాత సిరిసిల్లలోని పద్మశాలీ కల్యాణ మండపంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ది-సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గం అభినందన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ డిపాజిట్లతోపాటు రుణాలు అందించాలని, సంస్థ అభివృద్ధికి అవసరమైన డిపాజిట్ల సేకరణ కో సం ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించారు. తాము అధికారంలో లేకున్నా బ్యాంకు అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తోపాటు అధికారంలో ఉన్న పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. సెస్ సంస్థకు సంబంధించిన డిపాజిట్లను అర్బన్ బ్యాంకులో చేసేలా సహకారం తీసుకోవాలన్నారు. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన అర్బన్ బ్యాంకు ఎన్నికలు హోరాహోరీగా సాగాయని, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల తరహాలో జరిగాయని, ఈ పోటాపోటీ ఎన్నికల్లో గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. పోటీలో నిలిచి ఓడిన వారు, గెలిచిన వారు సమన్వయంతో పని చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాబోయే నాలుగేండ్లలో కౌన్సిలర్ ఎన్నికలు మినహా వేరే ఏ ఎన్నికలు లేవని, ఎటువంటి పంచాయితీలు లేకుండా బ్యాంకు సిరిసిల్ల పట్టణాభివృద్ధికి పాటు పడాలని కోరారు. అంతకుముందు బ్యాంకు నూతన చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, పాలకవర్గంతో పాటు సభ్యులందరి సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బ్యాంకు డివిడెంట్ల సమస్య పరిష్కారం కోసం రిజర్వ్ బ్యాంకు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఫోన్ పే, గూగుల్ పే సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భారీ మెజార్టీతో తమకు విజయాన్ని అందించిన ఖాతాదారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే కేటీఆర్ సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకు ముందు పాలకవర్గ సభ్యులు కేటీఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ అభయహస్తం ఏమైంది?

దళితులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నది? దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పేరున ₹12 లక్షలు ఇస్తామని చెప్పింది? కానీ, ఆ హామీ ఏమైంది? ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. దళితులను ధనికులుగా చేసేందుకు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్ర యత్నం చేశారు. అందులో భాగంగా దళితబంధు పథకం తె చ్చారు. ఇది దమ్మున్న నాయకుడు తీసుకున్న నిర్ణయం. అంబేద్కర్ చేసిన కృషిని గౌరవించుకునేలా సెక్రటేరియట్‌కు ఆయన పేరును పెట్టారు. 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పారు. దళితుల అభ్యున్నతికి దళితబంధు పథకం ప్రవేశ పెట్టడం వల్ల పదిరలో పెట్రోల్‌బంకు, దుమాల శివారులో విజయలక్ష్మి ఇండస్ట్రీస్ పేరిట రైస్‌మిల్లును ఏర్పాటు చేసుకున్నారు.

**- అంబేద్కర్ విగ్రహావిష్కరణలో కేటీఆర్**

# చిరు వ్యాపారాలు కళకళ

**కేసీఆర్ ప్రణాళికతో వెలుగులు**





- ఉమ్మడి రాష్ట్రంలో కోతలే కోతలు
- చిన్నా, చితకా వ్యాపారాలు డీలా
- పదేళ్ల కిందటి రోజులు తలుచుకుంటేనే భయం
- స్వరాష్ట్రంలో మారిన పరిస్థితి
- నాణ్యమైన కరెంటుతో గాడినపడ్డ వ్యాపారాలు

"ఉమ్మడి రాష్ట్రంలో కమ్ముకున్న కరెంట్ చీకట్లు స్వరాష్ట్రంలో తొలిగిపోయాయి. తెలంగాణ వచ్చిన ఆరు నెలల్లోనే సరికొత్త వెలుగులు నిండాయి. దీంతో తమ వ్యాపారాలు గాడిన పడ్డాయని చిరువ్యాపారులు చెబుతున్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత నిరంతర కరెంట్‌తో తమకు భరోసా దొరికిందని సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఉమ్మడి రాష్ట్రంలో సరైన విద్యుత్ సరఫరా లేక వ్యాపారాలు సాగేవి కాదని, ఆ రోజులను తలుచుకుంటేనే భయం వేస్తున్నదని అంటున్నారు. మళ్లీ అలాంటి పరిస్థితులు రావొద్దని, కరెంట్ విషయంలో అనవసరంగా కేసీఆర్‌ను బద్నాం చేయొద్దని సూచిస్తున్నారు.

కరీంనగర్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉండేది. ఒక ప్రణాళిక పద్ధతి ఉండేది కాదు. కరెంట్ ఎప్పుడు ఉండేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. కరెంట్ పోయినప్పుడు పెద్ద పెద్ద వ్యాపారులు జనరేటర్లు వినియోగించి వ్యాపారాలు చేసే వారు. కానీ, చిరువ్యాపారులు మాత్రం గంటల కొద్దీ కరెంట్ కోతలతో తల్లడిల్లేది. దుకాణాలు మూసేసి ఖాళీగా కూర్చునే పరిస్థితి ఉండేది. గిరాకీలు కూడా దెబ్బతినేది. ఉపాధిపై ప్రభావం పడేది. ఫలితంగా చిన్నా చితక వ్యాపారాలు నిర్వీర్యమయ్యే దుస్థితి ఉండేది. దుకాణాల అద్దెలు చెల్లించలేక అనేక మంది తమ వ్యాపారాలను మూసేసిన పరిస్థితి అప్పట్లో కనిపించేది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, జువెల్లరీ షాపులు జనరేటర్లపై ఆధార పడినా.. ఆర్థిక భారంతో ఇబ్బంది పడేది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికతో అన్ని రంగాలకూ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అయింది. షాపింగ్ మాల్స్, ఇతర వ్యాపార, వాణిజ్య వర్గాలు ఏర్పాటు చేసుకున్న భారీ జనరేటర్లు సైతం మూలనపడ్డాయి. నాడు నగరాలు, పట్టణాల్లో వినిపించిన మోతలు పూర్తిగా ఆగిపోయాయి. ఇటు చిరు వ్యాపారులు కూడా కుదురుగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితి వచ్చింది. తమ వ్యాపారాలను విస్తరించుకునే అవకాశం ఏర్పడింది.

### చేతి నిండా పనిదొరికేది..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నిరంతరం కరెంట్ ఉండేది. దీంతో మాకు చేతి నిండా పని దొరికేది. ఏ ఇబ్బంది ఉండేది కాదు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. ట్రాన్స్‌కో అధికారులు ప్రతి నెలా రెండో శనివారం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేసినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని భరిస్తున్నాం. కానీ, మిగతా సమయాల్లో ఎందుకు కరెంట్ పోతుందో తెలుస్తలేదు. దీంతో వెల్డింగ్ పనులకు ఇబ్బందులు వస్తున్నయ్. కరెంట్ అంతరాయంతో పనులు చేసుకోలేక పోతున్నం. ఉపాధి కోల్పోతున్నం.

**-కూరపాటి మల్లేశం, వెల్డర్ (ధర్మారం)**



### మళ్లీ జనరేటర్లు అవసరమైతయ్

తెలంగాణ రాక ముందు చీటికి మాటికి కరెంటు పోతుండె. అప్పట్లో మినీ జనరేటర్ వాడేవాడిని. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ఆ అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ జనరేటర్లు అవసరమయ్యేటట్టున్నయ్. కరెంట్ విషయంలో ఇప్పటి ప్రభుత్వం ఫెయిల్ అయింది. నాణ్యమైన కరెంటు ఇవ్వకపోతే ప్రతి వ్యవస్థకు చాలా ఇబ్బంది వస్తయ్.

**- రవీందర్‌రెడ్డి, మెగా ఫొటోస్టూడియో (హుజూరాబాద్)**

### షటర్ కిరాయి ఎల్తలేదు



నేను 18 ఏండ్లుగా సిరిసిల్లలో జ్యూస్ స్టాల్ నడిపిస్తున్న. గతంలో కాంగ్రెస్ అధికారంల ఉన్నప్పుడు కరెంటు సమస్యతో జనరేటర్ మీద ఆధారపడి దుకాణం నడిపెటోళ్లం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటలు కరెంటు ఇచ్చింద్రు. పదేళ్లు ఏ సమస్య లేకుండా గడిచింది. కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాకపోవడం మాకు శాపమైంది. కాంగ్రెస్ సర్కారు వచ్చి ఆరు నెలలు కాకముందే కరెంటు కష్టాలు మళ్లీ మొదలైనయ్. కరెంటు ఎప్పుడు పోతదో.. పోయిన కరెంటు మళ్లెప్పుడొస్తదో కూడా తెలుస్తలేదు. జ్యూస్ కోసం వచ్చిన కస్టమర్లు కరెంటు లేక మర్రిపోతున్రు. గిరాకీ లేక షటర్ కిరాయి కట్టే పరిస్థితి లేకుండా పోయింది. నెలయ్యిందంటే అప్పులు చేసి కిరాయి కడుతున్నం. మూలకేసిన జనరేటర్లను రిపేర్ చేయించి దుకాణం నడిపిస్తున్నం. కొద్దిపాటి గిరాకీతో కుటుంబం గడవడం భారంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో మాలాంటి సామాన్యులకు కష్టాలు తప్పడం లేదు.

**- కంచర్ల రవిగౌడ్, జ్యూస్ స్టాల్ నిర్వాహకుడు, పాతబస్టాండ్ (సిరిసిల్ల)**



### కరెంటు కోసం చూసెటోళ్లం

రాష్ట్రం ఏర్పడక ముందు పొద్దంతా కరెంటు పోయేది. ఎప్పుడు వస్తుందా.. అని ఎదురు చూసెటోళ్లం. నేను 30 ఏళ్లుగా ఫొటో స్టూడియో నడుపుతున్న. తెలంగాణ రాక ముందు కరెంటు సక్కగ ఉండకపోయేది. దీంతో గిరాకీ దెబ్బతినేది. అప్పుడు ఇన్వర్టర్లు పెట్టుకుని నడిపించినా అవి నాలుగైదు గంటల బ్యాక్ అప్ వచ్చి అయిపోయేవి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 24 గంటల పాటు కరెంటు ఉన్నది. మాకు ఇన్వర్టర్లతో పనిలేకుండా పోయింది.

**- సిరిపురం శ్రీనివాస్, ఫొటోస్టూడియో నిర్వాహకుడు (చొప్పదండి)**

## సాంకేతిక లోపంతో నిలిచిన రైలు

- అరగంటకుపైగా ట్రాఫిక్ జామ్
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందిపడ్డ వాహనదారులు

ముకరంపుర, జూన్ 21 : కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద శుక్రవారం ఉదయం సాంకేతిక లోపం వల్ల రైలు ఆగిపోవడంతో కరీంనగర్-చొప్పదండి ప్రధాన రహదారిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్టేషన్ నుంచి రైలు జగిత్యాల వైపునకు వెళ్లే క్రమంలో తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్దకు చేరుకోగానే సాంకేతిక లోపం తలెత్తి ఆగిపోయింది. దీంతో కరీంనగర్ చొప్పదండి ప్రధాన రహదారిపై ఇరువైపులా రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు 40 నిమిషాలకు పైగా వాహనదారులు ట్రాఫిక్ లో చిక్కుకొని అవస్థ పడ్డారు. చివరకు రైల్వే సిబ్బంది లోపాన్ని సరిచేసి రైలును స్టేషన్ వైపునకు మళ్లించారు.

# స్మార్ట్‌సిటీ పనులపై 'విజిలెన్స్'

- విచారణ ప్రారంభించిన అధికారులు
- వివరాలు ఇవ్వాలంటూ లేఖ



కరీంనగర్ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు ఫోకస్ చేశారు. ఈ పనులకు సంబంధించి పూర్తి వివరాలను మూడు రోజుల్లోగా అందించాలని నగరపాలక సంస్థ, స్మార్ట్‌సిటీ కంపెనీ అధికారులకు శుక్రవారం లేఖ రాశారు. వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, డీపీఆర్‌లు, టెండర్లు, ఎంబీ రికార్డులు, చెల్లింపులు ఇలా అన్ని వివరాలను పంపించాలని అందులో సూచించారు. విజిలెన్స్ విచారణ మొదలు కావడం బల్దియాలో చర్చనీయాశంమైంది. ఇటు పలువురు కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారుల్లో గుబులు పుడుతున్నట్టు తెలుస్తున్నది.

కార్పొరేషన్, జూన్ 21 : ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షలో విజిలెన్స్ విచారణ చేపడుతామని తెలిపారు. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. స్మార్ట్‌సిటీలో ప్యాకేజీ 2లోని ఫేస్-1 అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందుకు సంబంధించి అడ్మినిస్ట్రేషన్ మంజూరుతోపాటు ఎంబీ రికార్డులను మూడు రోజుల్లో అందించాలని నగరపాలక సంస్థ అధికారులు, స్మార్ట్‌సిటీ కంపెనీ అధికారులకు సూచించారు. ఇంకా వరద కాలువల నిర్మాణాలు, ఫేస్ 2లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రోడ్లు, స్టాటిక్ కంప్యాక్టర్ స్థాపనతోపాటు షెడ్ నిర్మాణం, రోడ్డు సూచికలు, అంబేద్కర్ స్టేడియంలో వివిధ అభివృద్ధి పనులు, ప్రత్యేక వినియోగ ఆఫీస్ (ఎస్‌పీవీ), ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డీఆర్‌ఎఫ్ కార్యాలయ సివిల్ పనులు, సాంకేతిక (ఐటీ) పనులకు సంబంధించి ప్రతిపాదనలు, టెక్నికల్ మంజూరీలు తదితర పూర్తి వివరాలను అందించాలని స్పష్టం చేశారు. వీటితోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ, కరీంనగర్ డెయిరీ సమీపంలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ , టవర్‌సర్కిల్‌లో రెనోవేషన్ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల పనులు, పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 24 గంటల మంచినీటి సరఫరా పనులకు సం బంధించిన పూర్తి వివరాలు అందించాలని శుక్రవారం పంపించిన లేఖలో కోరారు. మొత్తంగా స్మార్ట్‌సిటీ పనులపై విజిలెన్స్ ఫోకస్ చేయడం బల్దియాలో హాట్‌టాపిక్‌గా మారింది. కొద్ది రోజులుగా వివిధ వర్గాలు, కార్పొరేటర్ల నుంచి విమర్శలు వస్తుండగా.. ఈ విచారణలో ఎలాంటి విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.




- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571